క్లుప్తంగా

మంచు దుప్పట్లో పుల్లలచెరువు



పుల్లలచెరువులో కురిసిన మంచు

పుల్లలచెరువు: మండల కేంద్రం పుల్లలచెరువును సోమవారం మంచు కప్పేసింది. తెల్లవారు జాము నుంచి ఉదయం 8.15 గంటల వరకు మంచు కురవడంతో రహదారులన్నీ మంచుతో కప్పుకున్నాయి. వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు. చలితో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 8.30 గంటలకు సూర్యుడు దర్శనంతో ప్రజలు ఉపశమనం పొందారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



భక్తులకు దర్శనం ఇస్తున్న సీతారాములోరు

పుల్లలచెరువు: ధనుర్మాసం సందర్భంగా ఎనిమిదో రోజు సోమవారం వేకువ జాము నుంచి పుల్లలచెరువు, ఉమ్మడివరం, ముటకుల గ్రామాల్లోని ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు చేశారు. తెల్లవారు జామున 4 గంటల నుంచి 6 గంటల వరకు నిర్వహించిన పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఎంతో పవిత్ర ధనుర్మాసంలో గోదాదేవికి విశేష పూజలు నిర్వహించడం సంప్రదాయం.. అని పూజారి శంకు తెలిపారు. ఆయా గ్రామాల్లోని ఆలయ పరిసర ప్రాంతాల్లో వేకువ జాము నుంచి గోవింద నామస్మరణతో మార్మోగింది. స్వామి వార్లు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



నిరుపయోగంగా ఉన్న కురిచేడు-2 సచివాలయ భవనం



కురిచేడు-2 రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్ భవనం



పదమరనాయుడుపాలెంలో రైతు భరోసా, విలేజ్ క్లినిక్ భవనం ఇలా..

కూటమి నేతల చిల్లర చేష్టలు

- ప్రభుత్వ భవనాలను వినియోగించని నేతలు
- కోట్లాది రూపాయలు నిరుపయోగం
- శిథిలావస్థకు చేరుతున్న భవనాలు
- వాటిల్లో అసాంఘిక కార్యకలాపాలు

కురిచేడు:

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రజల కోసం నిర్మించిన భవనాలు ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో నిరుపయోగంగా ఉన్నాయి. కూటమి నేతలు పట్టుదలే ముఖ్యమని గత ప్రభుత్వం నిర్మించిన భవనాలను నిరుపయోగం చేసింది. దీంతో వందల కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతోంది. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతామని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రజాధనం దుర్వినియోగం చేస్తూ రాష్ట్రాన్ని అప్పులు పాలుజేస్తోంది. ప్రజల వద్దకు పాలన తీసుకెళ్లాలనే సదుద్దేశంతో గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉద్యోగులకు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు కావాల్సిన రక్షణ భవనాలు వందల కోట్ల రూపాయలతో నిర్మించింది. వాటిల్లో కొన్ని పూర్తికాగా మరికొన్ని భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. ఒక్కో గ్రామ పంచాయతీకి సుమారు రూ.80 లక్షలతో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మించారు. వాటిని నేటికీ ఉపయోగంలోకి తీసుకురాకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. ప్రజాధనం కోట్లాది రూపాయలతో ఖర్చు చేసి నిర్మించిన భవనాలు ఎవరు అధికారంలో ఉన్నా వాటిని ప్రజోపయోగంగా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. ప్రజాధనం వృథా చేయడంపై పాలకులకు ఉన్న శ్రద్ధ ఏ పాటిదో అర్థమవుతోంది. ప్రజల అవసరాల కన్నా పాలకుల పట్టుదల, వ్యక్తిగత ఈర్ష్య, ద్వేషాలే మిన్న అన్న చందంగా ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరిస్తోంది. మండలంలోని పదమరనాయుడుపాలెం గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. 80 లక్షల రూపాయలతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుయోగం అయ్యాయి. వాటికి పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించి వాటిని వినియోగించుకునే అవకాశం ఉన్నా ఆ దిశగా ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. అన్ని వసతులతో భవనాలు ఉన్నా గ్రామంలోని ఓ చిన్న భవనంలో గ్రామ సచివాలయంతో పాటు రైతు భరోసా కేంద్రం నిర్వహిస్తున్నారు. గ్రామ సచివాలయంలో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నా కనీసం వార్డు మెంబర్లు కూర్చుని సమావేశం నిర్వహించే స్థలం కూడా లేదు. కురిచేడు-2లో కూడా గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిరుపయోగంగా ఉన్నాయి. వాటిని ప్రజోపయోగంలోకి తెస్తే ప్రజాధనం కోట్లాది రూపాయలు వృథా కాకుండా ఉంటుంది.



పదమరనాయుడుపాలెంలో నిరుపయోగంగా ఉన్న సచివాలయం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

దర్శి: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు గాయాలపాలైన సంఘటన మండలంలోని రాజంపల్లి సమీపంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. పాలడైరీలో పనిచేసే శ్రీనివాసరావు కార్యాలయానికి మోటారు సైకిల్‌పై వెళ్తున్నాడు. పొదిలి నుంచి వస్తున్న శంకరాపురం గ్రామానికి చెందిన నరేంద్ర ఎదురుగా వస్తున్న శ్రీనివాసరావు బైక్‌ను ఢీకొట్టాడు. శ్రీనివాసరావు తలకు తీవ్ర గాయంకాగా నరేంద్రకు కూడా గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది పైలట్ నరేష్‌బాబు, ఈఎంటీ గౌస్‌బాషాలు క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



గాయపడిన శ్రీనివాసరావు



నరేంద్ర..

108లో గర్భిణి సుఖ ప్రసవం



తల్లి, బిడ్డతో 108 సిబ్బంది

దొనకొండ: మండలంలోని చందవరం గ్రామానికి చెందిన గర్భిణి ఆదివారం అర్ధరాత్రి 108లో సురక్షితంగా ప్రసవించింది. వివరాలు... గ్రామానికి చెందిన ఎస్.గురవమ్మ డెలివరీ నొప్పులతో బాధపడుతోంది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఆమెను మార్కాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్తున్నారు. దేవరాజుగట్టు గ్రామానికి వచ్చేలోపు నొప్పులు పెరిగి పండంటి బిడ్డను సురక్షితంగా ప్రసవించింది. గురవమ్మ కుటుంబం 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపింది. ఈఎంటీ పి.వెలుగొండయ్య, పైలట్ డి.శ్రీనును ఓఈ రాజేంద్రప్రసాద్, డీఎం విజయ్‌కుమార్ అభినందించారు.

సిక్కిం సత్యసాయి భక్త బృందం ప్రత్యేక పూజలు



హారతి ఇస్తున్న సిక్కిం సత్యసాయి భక్త బృందం

త్రిపురాంతకం: సిక్కింకు చెందిన సత్యసాయి సేవా బృందం ఆధ్వర్యంలో ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమం నిర్వహించారు. స్థానిక శ్రీబాలాత్రిపురసుందరీదేవి, శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయాలను సత్యసాయి భక్త బృందం దర్శించి పూజలు చేసింది. అనంతరం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమం నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. సత్యసాయిబాబా విశిష్టతను వివరించారు. సిక్కిం సత్యసాయి కో ఆర్డినేటర్ సరిత సుబ్బ, జిల్లా ప్రెసిడెంట్ బసంత్ చత్రి, యూత్ కో ఆర్డినేటర్ షేకర్ చత్రి, వేద స్టేట్ ఆర్‌పీ కో ఆర్డినేటర్ సరస్వతి శర్మ, ప్రకాశం జిల్లా సత్యసాయి సంస్థల భక్త బృందానికి చెందిన తంగిరాల రామిరెడ్డి, గాలి రమణారెడ్డి, కొల్లి సత్యనారాయణరెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

అధికారుల కోసం ఎదురు చూస్తున్న మీకోసం



మీ కోసం కార్యక్రమానికి హాజరైన అధికారులు

కురిచేడు: ప్రతి సోమవారం ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు తహసీల్దార్ కార్యాలయంలో జరిగే మీ కోసం కార్యక్రమం అధికారుల కోసం ఎదురు చూస్తోంది. మీ కోసం కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాల్సి ఉంది. కానీ కొన్ని నెలలుగా ఒకరిద్దరు మినహా మిగిలిన శాఖల అధికారులు ఆ వైపు తొంగి కూడా చూడటం లేదు. అయినా జిల్లా స్థాయి అధికారులు మండల స్థాయి అధికారులను మీ కోసం కార్యక్రమానికి హాజరయ్యేలా చూడటంలో విఫలమయ్యారు. దీంతో ప్రజలు అర్జీలు ఇచ్చినా తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని, ఒంగోలు వెళ్లి కలెక్టర్‌కు ఫిర్యాదులు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులందరూ మీకోసం కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఫార్మర్ చాట్ అప్లికేషన్‌తో రైతులకు మేలు

యర్రగొండపాలెం: మిర్చి పండించే రైతులకు ఫార్మర్ చాట్ అప్లికేషన్ ఎంతగానో మేలు చేస్తుందని ఉద్యానశాఖాధికారి పి.ఆదిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో ఉద్యాన శాఖ, డిజిటల్ గ్రీన్ సంస్థ ఆధ్వర్యంలో ఈ–మిర్చ 2.0 ప్రాజెక్టుపై పుల్లలచెరువు, త్రిపురాంతకం, యర్రగొండపాలెం మండలాలకు చెందిన ఆ సేవా కేంద్రాల సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిరప రైతులకు సాంకేతిక సలహాలు అర్థమయ్యే భాషలో వీడియోల రూపంలో తెలపాలని, ఉద్యాన శాఖ డిజిటల్ గ్రీన్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకొని ఈ మిర్చ 2.0 ప్రాజెక్టును చేపట్టామని, అందులో భాగంగా కొత్తగా ఫార్మర్ చాట్ అనే అప్లికేషన్‌ను తయారు చేశారని, ఆర్బీకేల్లో పనిచేసే సిబ్బంది ఈ అప్లికేషన్ గురించి రైతులకు అవగాహన పరచాలన్నారు. ఈ అప్లికేషన్ ద్వారా రైతులు సులభంగా తమ సెల్‌ఫోన్‌ల్లో మిరప పంటకు సంబంధించిన ఆధునిక సాంకేతిక సమాచారాన్ని ఎప్పటికప్పుడు చూసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఏవో కేవీ శేషారెడ్డి, డిజిటల్ గ్రీన్ సంస్థ మేనేజర్ కమలాకర్ పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం



గణిత ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఈవోలు ఆంజనేయులు, మల్లునాయక్

యర్రగొండపాలెం: గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా మండలంలోని పలు పాఠశాలల్లో సోమవారం గణిత దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక కృష్ణవేణి, యాపిల్ పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లునాయక్ మాట్లాడుతూ 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గణిత మేధావులు ఆర్యభట్ట, భాస్కరాచార్యులు, ఆ తర్వాత రామానుజన్ ఒకరని, అటువంటి మేధావిని స్మరించుకుంటే విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు చేసిన గణిత ప్రాజెక్టులను పరిశీలించి వారిని అభినందించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్ కృష్ణనాయక్, బాపూజీ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 51 అర్జీలు

దొనకొండ: మండలంలోని రామాపురంలో తహసీల్దార్ బి.రమాదేవి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి 51 అర్జీలు అందాయి. రెవెన్యూ సిబ్బందితో అర్జీలు పరిశీలించి అర్హులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ తెలిపారు. రీసర్వే డీటీ కేవీ నాగార్జునరెడ్డి, లైసెన్స్ సర్వేయర్ సీహెచ్ వెంకట్రావు, వీఆర్‌ఓ కోటయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి

దర్శి: పార్లమెంట్‌లో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని రాష్ట్ర దళిత సేన అధ్యక్షుడు, నవ్యాంధ్ర మాదిగ చర్మ డప్పు కళాకారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గర్నెపూడి ప్రేమ్‌కుమార్, కవలకుంట్ల గోవింద్ ప్రసాద్‌లు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమిత్ షా వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయన్నారు. ఇటువంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డీబీఆర్‌సీ నాయకులు తప్పెట డేవిడ్, కొర్నెపాటి కోటీ పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘ నాయకులు

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం



తాళ్లూరు: రైతులతో ఏఓ ప్రసాద్‌రావు

తాళ్లూరు: వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాలను రైతులు ఉపయోగించుకోవాలని వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు సూచించారు. జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం తాళ్లూరులో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న పంటల బీమా, వడ్డీలేని రుణాలు, అన్నదాత సుఖీభవ, ప్రకృతి వ్యవసాయం, ఉద్యాన శాఖ, వ్యవసాయ యాంత్రీకరణ, పొలం పిలుస్తోంది, భూసార పరీక్షలు, విత్తన రాయితీ తదితర పథకాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రబీలో సాగు చేసే పంటలకు ఈ– క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. మండల రైతులు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించేందుకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు ఉందన్నారు. ఏఈఓ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



యర్రగొండపాలెం: విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ కిరణ్‌గౌడ్



దర్శి: పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు

దర్శి: మండలంలోని కట్టశింగన్నపాలెం ప్రాథమిక పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు క్రిస్మస్ తాత వేషధారణలతో అలరింపజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ప్రధానోపాధ్యాయుడు పి.సుధాకర్‌రావు మాట్లాడుతూ ప్రేమ, కరుణ, త్యాగాలకు ప్రతిరూపం ఏసుక్రీస్తు అని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన చూపిన మంచి మార్గం అనుసరించాలని సూచించారు. ఉపాధ్యాయులు గొర్రెపాటి వేణు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: స్థానిక రెయిన్‌బో హైస్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం జరిగిన వేడుకలను ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్ ప్రారంభించారు. ఈ నెల 25న జరిగే క్రిస్మస్ పండగను జరుపుకుని ఆనందంగా గడపాలని ఆయన శుభాకాంక్షలు తెలిపారు. చదువుల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆయన ప్రశంస పత్రాలు అందచేశారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రిన్సిపాల్ నిఖిలా కిరణ్ పాల్గొన్నారు.